quicktodaynews.com

RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక

EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 314 | గురువారం 8 ఆగస్టు 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

## చేనేతకు అండగా ఉంటాం

### నేతన్నలకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు



**హైదరాబాద్, ఆగస్టు 7 (క్విక్ టుడే న్యూస్) :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. నాటి స్వాతంత్య్ర సంగ్రామంలో ఒక సాధనమైన చేనేత నేటి తెలంగాణ పునర్నిర్మాణం లోనూ ప్రధానంగా నిలిచింది, చేనేతకు పునరుజ్జీవం కల్పించడాన్ని ప్రజా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తోంది. మహిళా శక్తి గ్రూపులు, ప్రభుత్వ శాఖల ద్వారా చేనేతను ప్రోత్సహించే కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని సీఎం ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.



## భారతావని గుండె..

# బరువెక్కిపోయింది

### ఫైనల్స్‌లో వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు

- 50కేజీల విభాగంలో 100 గ్రాముల అధిక బరువు
- భారత అభిమానులకు షాక్
- నువ్వెప్పుడూ ఛాంపియన్‌వే
- ఓదారుస్తూ ప్రధాని మోడీ ప్రకటన
- పిటి ఉషతో కారణాలపై ఆరా

**న్యూఢిల్లీ, ఆగస్ట్7 :** పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫోగాట్ పతకం సాధిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్న భారత అభిమానులకు షాక్ తగిలింది. 50 కేజీల విభాగంలో ఇవాళ రాత్రి ఫైనల్‌లో వినేశ్ తలపడాల్సి ఉంది. ఈ క్రమంలో ఆమె బరువును చూసిన నిర్వాహకులు 100 గ్రాములు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో వినేశ్‌పై అనర్హత వేటు వేస్తూ ఒలింపిక్ కమిటీ, రెజ్లింగ్ కమిటీ నిర్ణయం తీసు కున్నాయి. ఫైనల్ పోరులో పసిడి పతకం సాధిస్తుందన్న ఆశల వేళ ఈ వార్త కోట్లాది మంది భారతీయుల హృదయాలను ముక్కలు చేసింది. ఈ క్రమంలోనే అనర్హతపై ప్రధాని మోదీ స్పందిస్తూ వినేశ్‌ను ఓదార్చారు. వినేశ్.. నువ్వు ఛాంపియన్లకే ఛాంపియన్! నీ ప్రతిభ దేశానికి గర్వకారణం. భారతీయులందరికీ నువ్వు స్ఫూర్తిదాయకం. ఈ రోజు నీకు తగిలిన ఎదురుదెబ్బ ఎంతో బాధించింది. దీన్ని వ్యక్తం చేయడానికి నా దగ్గర మాటల్లేవు. కానీ,ఈ బాధ నుంచి బయటపడి నువ్వు బలంగా తిరిగి రాగలవని నేను నమ్ముతున్నా. సవాళ్లను ఎదిరించడం నీ నైజం. నీకు మేమంతా అండగా ఉన్నాం అని మోదీ భరోసానిచ్చారు. తాజా పరిణామాల వేళ భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. వినేశ్‌పై అనర్హతకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీసిన ప్రధాని.. దీన్ని సవాల్ చేసేందుకు భారత్‌కు ఉన్న అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వినేశ్‌కు ఉపయోగపడు తుందనుకుంటే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ వద్ద భారత్ నిరసనను బలంగా వ్యక్తపర్చాలని పీటీ ఉషకు సూచించినట్లు సమాచారం.



### భద్రాచలంలో

## భారీ వర్షం

### గోదావరిలో పెరుగుతున్న నీటిమట్టం

**భద్రాచలం,ఆగస్ట్7 (క్విక్ టుడే న్యూస్) :** భద్రాచలంలో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. దీంతో పరిసర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం వద్దకు భారీగా వరదనీరు చేరింది. అన్నదాన సత్రం పక్కనే ఉన్న డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. పడమర మెట్ల వైపు మోకాలు లోతు నీరు చేరడంతో భక్తులు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. కరకట్ట వద్ద లూయిస్‌ను మూసి ఉంచడంతో వర్షపునీరు డ్రైనేజీ గుండా గోదావరిలో కలవడం లేదు. దీంతో కాంప్లెక్స్‌లో వర్షపునీటితో పాటు మురుగు చేరింది. కరకట్ట విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న మోటార్లను ఆన్ చేయడంతో మురుగునీటిని డంపింగ్ చేస్తున్నారు. సమీపంలోని దుకాణాల్లోకి వర్షపునీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం మళ్లీ క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లోని ఇంద్రావతి వైపు నుంచి వరద చేరుతోంది. దీంతో నీటమట్టం పెరుగుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## ట్రంప్ హత్యకు భారీ కుట్ర



### పాక్ జాతీయుడిని అరెస్ట్ చేసిన అమెరికా

**వాషింగ్టన్, ఆగస్ట్7 :** ఇరాన్‌తో లింకులు ఉన్న పాకిస్థానీ జాతీయుడిని .. అమెరికా అరెస్టు చేసింది. అమెరికా రాజకీయవేత్తలను హత్య చేసేందుకు ఆ పాక్ వ్యక్తి ప్లాన్ వేసినట్లు న్యూయార్క్ ఫెడరల్ కోర్టు పేర్కొన్నది. రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు అతను ప్లాన్ వేసినట్లు అనుమానిస్తున్నారు. పాక్‌కు చెందిన అసిఫ్ రాజా మెర్చంట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై అభియోగాలు నమోదు అయినట్లు అమెరికా అటార్నీ జనరల్ మెర్రిక్ గార్లాండ్ తెలిపారు. జనరల్ మిగతా 2లో..

## 15న సీతారామ ప్రాజెక్టు ప్రారంభం

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న సిఎం రేవంత్ రెడ్డి
- వైరాలో లక్షమంది రైతులతో భారీ బహిరంగ సభ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, ఆగస్టు 7 (క్విక్ టుడే న్యూస్) :** ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆగస్టు 15న మిగతా 2లో..

## బీజేపీలో బీఆర్ఎస్ విలీనం దుష్ప్రచారం

- ఇలాంటి వార్తల ప్రచారంపై కెటిఆర్ ఆగ్రహం
- న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



**హైదరాబాద్, ఆగస్టు 7 (క్విక్ టుడే న్యూస్) :** బీజేపీలో బీఆర్ఎస్ విలీనం లేదు.. అలా తప్పుడు వార్తలు ప్రసారం చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు మిగతా 2లో..

## వివింట్ ఫార్మా

# రూ.400 కోట్ల పెట్టుబడి

### తెలంగాణ జీనోమ్ వ్యాలీలో ఇంజెక్టబుల్స్ తయారీ కేంద్రం ఏర్పాటుకు సంసిద్ధత

- 1000 మందికి ఉద్యోగావకాశాల కల్పన
- సీఎం రేవంత్ రెడ్డితో కంపెనీ బృందం చర్చలు
- తెలంగాణ పెట్టుబడులకు వివిధ కంపెనీలు ఆసక్తి



**హైదరాబాద్, ఆగస్టు 7 (క్విక్ టుడే న్యూస్) :** తెలంగాణలో పెట్టుబడులకు పేరొందిన కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. పెట్టుబడుల సమీకరణ లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం వివిధ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు జరుపుతోంది. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక ఇంజెక్టబుల్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి వివింట్ ఫార్మా కంపెనీ ముందుకొచ్చింది. రూ.400 మిగతా 2లో..

## పాదయాత్రలో ప్రజల గుండె చప్పుడు విన్నా

- మీ ఆశీర్వాదంతోనే డిప్యూటీ సీఎంను అయ్యా
- ఆదిలాబాద్‌ను గుండెల్లో పెట్టి చూసుకుంటా
- త్వరలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తాం
- ఆర్థిక ఇబ్బందులున్నా హామీలు అమలు చేస్తున్నాం
- ప్రతి రూపాయినీ జాగ్రత్తగా ఖర్చు పెడుతున్నాం
- హామీ ఇచ్చినట్టే ధరణి బంగాళాఖాతంలో వేశాం
- నిరుద్యోగులకోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం
- పిప్రిలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**ఆదిలాబాద్, ఆగస్ట్7 (క్విక్ టుడే న్యూస్):** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని డిప్యూటీ మిగతా 2లో..

## రెండు పిల్లర్లు కుంగితే ఇంత దుష్ప్రచారమా?

- నీటిని ఎత్తి పోయకుండా రైతులను ఎండబెడతారా
- మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి మండిపాటు

2

## ఏపీలో మూడు నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేత

- క్యూఆర్ కోడ్‌తో కూడిన పాస్‌పుస్తకాలు పంపిణీ
- త్వరలోనే గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు
- మావోయిస్టులపై మరో ఏడాది నిషేధం విధింపు
- అక్టోబర్ నుంచి కొత్త మద్యం విధానం..
- మత్స్యకారుల 217 జీవో తొలగింపు
- సున్నిపెంటలో 280 ఎకరాలు తిరిగి జలవనరులశాఖకు బదలాయింపు
- వైద్య కళాశాల్లో అదనంగా 380 పోస్టులు భర్తీ
- ఏపీ కేబినేట్ కీలక నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

2

మొదటి పేజీ తరువాయి..

# వివింట్ ఫార్మా రూ.400 కోట్ల పెట్టుబడి



కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయబోయే ఈ కంపెనీ దాదాపు వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందం వివింట్ కంపెనీ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల అనంతరం పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం జీనోమ్ వ్యాలీలో వివింట్ కంపెనీ ఆర్ అండ్ డీ కేంద్రం ఉంది. సుమారు రూ. 70 కోట్లతో నెలకొల్పిన ఈ సదుపాయాలతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో విస్తరించేందుకు కంపెనీ ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా హైదరాబాద్ లో తన మొదటి తయారీ కర్మాగారాన్ని స్థాపించనుంది. జీనోమ్ వ్యాలీలో పెట్టుబడులకు వివింట్ ఫార్మా ముందుకు రావటంపై ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. తెలంగాణలో అన్ని పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని, జీనోమ్ వ్యాలీ ఔషద కంపెనీలను తప్పకుండా ఆకర్షిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

# 15న సీతారామ ప్రాజెక్టు ప్రారంభం

ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని జలసౌధలో అధికారులతో కలిసి ఆయన నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ ను ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు ఉత్తమ్ పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ,సహాయ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీలు అనిల్ కుమార్, నాగేందర్ రావు, డిప్యూటీ ఈఎన్సీ శ్రీనివాస్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజు గోల్కొండ కోటలో సీఎం రేవంత్ జెండా ఎగరేశాక హెలికాప్టర్ ద్వారా నేరుగా ఖమ్మం జిల్లా వైరాకు ముఖ్యమంత్రి చేరుకుంటారని ఉత్తమ్ తెలిపారు. అక్కడే భోజనాలు చేసి వైరాలో జరగనున్న భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారని అన్నారు. అంతకుముందే సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను రేవంత్ ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి ఖమ్మం రైతుల కల త్వరలో నెరవేరబోతోందని ఆయన స్పష్టం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఆగస్టు 15న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను జాతికి అంకితం చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ సందర్భంగా వైరాలో లక్ష మంది రైతులతో బహిరంగ నిర్వహిస్తామని తెలిపారు. సభా స్థలాన్ని ఖమ్మం కలెక్టర్ ముజ్మమిల్‌ఖాన్, ఖమ్మం సీపీ సునీల్‌దత్ తదితరులతో కలిసి ఆయన ఇటీవల పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ ప్రాజెక్టు చరిత్రలోనే తొలిసారిగా ఆగస్టు 5న సాగర్ జలాలను విడుదల చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కవైపు కృష్ణా జలాలు, మరోవైపు గోదావరి జలాలు వైరా రిజర్వాయర్ సహా ఖమ్మం జిల్లాలో ఆగస్టు 15 నాటికి ప్రవహించ నున్నాయని తెలిపారు. అలాగే రైతు రుణమాఫీకి సంబంధించి కూడా సీఎం రేవంత్‌రెడ్డి వైరా సభలో స్పష్టమైన ప్రకటన చేస్తారని చెప్పారు.

# బీజేపీలో బీఆర్ఎస్ విలీనం దుష్ప్రచారం

కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పైన, విలీనం లాంటి ఎజెండా పూరిత దుష్ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, వ్యక్తులు వెంటనే ప్రజలకి వివరణ ఇవ్వాలి. లేదంటే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని కేటీఆర్ హెచ్చరించారు. 24 సంవత్సరాలుగా ఇలాంటి అనేక కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారులను ఎదుర్కొన్న పార్టీ మాది. ఇవన్నీ దాటుకొని 24 ఏండ్ల పాటు నిబద్ధతతో, పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్. సాధించుకున్న తెలంగాణ సగర్వంగా నిలబెట్టుకొని, అభివృద్ధిలో అగ్రపథాన నిలిపాము అని కేటీఆర్ తెలిపారు. ఆత్మగౌరవం, అభివృద్ధిని పర్యాయపదాలుగా మార్చుకొని ఇతర రాష్ట్రాలకి ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాము. కోట్లాది గొంతుకలు, హృదయాలు తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ గుర్తింపు కోసం పోరాడుతున్నాయి కాబట్టే ఇది సాధ్యమైంది. ఎప్పటిలానే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం నిలబడుతుంది.. పోరాడుతుంది. ఇప్పటికైనా అడ్డగోలు అసత్యాలను, దుష్ప్రచారాలను మానుకోవాలి. పడతాం, లేస్తం, తెలంగాణ కోసమే పోరాడుతాం? కానీ తలవంచం.. ఎన్నటికైనా ఎప్పటికైనా అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# ట్రంప్ హత్యకు భారీ కుట్ర

ఖాసిమ్ సోలేమాని హత్య తర్వాత అమెరికా ప్రభుత్వాధికారులపై ఇరాన్ టార్గెట్ చేసినట్లు తెలుస్తోందన్నారు. పాకిస్థాన్ జాతీయుడైన అసిఫ్ రాజా.. కిరాయి హత్యలకు పాల్పడేందుకు సిద్ధమైనట్లు ఎఫ్‌బీఐ చీఫ్ క్రిస్టోఫర్ వ్రే తెలిపారు.అసిఫ్ రాజాకు ఇద్దరు భార్యలు ఉన్నారు. ఒకరు పాకిస్థాన్‌లో, మరొకరు ఇరాన్‌లో ఉన్నారు. రెండు దేశాల్లోనూ అతనికి పిల్లలు కూడా ఉన్నారు. అసిఫ్ వేసిన ప్రణాళికలు స్పై థ్రిల్లర్‌ను తలపిస్తున్నట్లు కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. డాక్యుమెంట్లను దొంగలించడం, యూఎస్బీ డ్రైవర్లను చోరీ చేయడం, నిరసనలు చేపట్టడం, ప్రభుత్వ అధికారులను చంపడం లాంటి ఎ÷-లాన్ వేశారు. అన్ని ప్రణాళికలకు కోడ్‌లు ఉన్నట్లు కోర్టు తెలిపింది. ఇటీవల పెన్సిల్వేనియాలో ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నానికి అసిఫ్‌తో లింకు లేదు. కానీ ఆ తరహా అటాక్‌లక ఎ÷-లాన్ వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అండర్‌కవర్ ఎఫ్‌బీఐ ఏజెంట్ల ద్వారా హత్యలకు ఎ÷-లాన్ వేసినట్లు న్యూయార్క్ ఎఫ్‌బీఐ ఫీల్డ్ ఆఫీస్ అసిస్టెంట్ డైరెక్టర్ క్రిస్టీ కర్టిస్ తెలిపారు.

# పాదయాత్రలో ప్రజల గుండె చప్పుడు విన్నా

సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని చెప్పారు.




ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో రూ.20.50 కోట్లతో పలు అభివృద్ధి పనులకు భట్టి విక్రమార్క భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు తాను ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ప్రారంభించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చరిత్రాత్మకమని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో పిప్రిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం భట్టి శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇక్కడి ప్రజల ఆశీర్వాదంతోనే తాను 32 రోజుల పాటు పాదయాత్ర చేశానని, ప్రజల గుండె చప్పుడు విన్నానని అన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యలు తెలుసుకునేందుక గతంలో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేశాను. గత ఏడాది మార్చి 16న పిప్పిరి నుంచే పీపుల్స్ మార్చ్ ప్రారంభించాను. ఈ ఏడాది మార్చి 16న ఇక్కడే సభ పెట్టాలనుకున్నాం.. కానీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. ఇవాళ జరిగే సభకు చాలా ప్రత్యేకత ఉంది. ఇక్కడి ప్రజల ఆశీర్వాదం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. నియోజకవర్గంలో 3,500 ఇళ్లకు తగ్గకుండా ఏడాదిలో 4.50లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. ఆరోగ్యశ్రీ కింద ఇచ్చే మొత్తాన్ని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాం అని భట్టి విక్రమార్క అన్నారు. మీ ఆశీర్వాదంతోనే డిప్యూటీ సీఎంను అయ్యానని భట్టి చెప్పారు. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ గుర్తున్నాయని, వాటిని ఒక్కొక్కటిగా కచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు. అప్పుడు చెప్పినట్టుగానే ధరణిని బంగాళాఖాతంలో వేశామని తెలిపారు. ధరణిపై కేబినెట్ సబ్ కమిటీ వేశామని, దానిని సమూలంగా ప్రక్షాళన చేస్తామని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వెనుకబడిన ప్రాంతం కాదని అన్నారు. ఈ జిల్లాను తాను గుండెల్లో పెట్టి చూసుకుంటానని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి రూపాయిని జాగ్రత్తగా ఖర్చు పెడుతున్నామని,ఆరు గ్యారెంటీల్లో అతి ముఖ్యమైన రుణమాఫీని అమలు చేశామని అన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని చెప్పారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని, 8 నెలల్లో 30 వేల కొలువులు భర్తీ చేశామని, అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ ను కూడా విడుదల చేశామని వివరించారు. ఆడ బిడ్డలకిచ్చిన మాటకోసం మహిళా తల్లులకు మొదటి రోజునే ఫ్రీ బస్ స్కీం ను ప్రారంభించామని చెప్పారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని భట్టి చెప్పారు. ఇందు కోసం ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు ఇవ్వనున్నట్టు ఆయన వివరించారు. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు ను నిర్మించి తీరుతామని అన్నారు రూ. 45 కోట్లు వెచ్చించి పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను ప్రారంభిస్తామని వివరించారు.

## రెండు పిల్లర్లు కుంగితే

# ఇంత దుష్ప్రచారమా?

### నీటిని ఎత్తి పోయకుండా రైతులను ఎండబెడతారా?

### మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి మండిపాటు



**నిజామాబాద్, ఆగస్ట్7 (క్విక్ టుడే న్యూస్):** మేగిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగిపోతే కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కొట్టుకుపోయినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు ప్రచారం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. అవాస్తవాలు ప్రచారం చేయడమే కాకుండా నీటిని ఎత్తిపోయకుండా, రైతులకు నీళ్లు ఇవ్వకుండా సముద్రంలోకి పోయేలా చేసి రైతులను ఏడిపించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ వద్ద గల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి లక్ష్మి, కాకతీయ కాలువలకు వేముల బుధవారం నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు సాగు, తాగు నీటి ఇబ్బంది ఉండొద్దని ప్రాణహిత, గోదావరి కలిసే చోట మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టారన్నారు. రూ.90 వేల కోట్ల ప్రాజెక్టులో భాగంగా రూ.4వేల కోట్లతో మేడిగడ్డ బ్యారేజీ నిర్మించారని తెలిపారు. అందులోని 84 పిల్లర్లలో కేవలం రెండు పిల్లర్లు కుంగితే దాన్ని సాకుగా చూపి కాళేశ్వరం పూర్తిగా కొట్టుకుపోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేసి రైతులను ఆగం చేసిందన్నారు. పైగా నీళ్లను ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బంది పెట్టిందని విమర్శించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీళ్లు ఉన్నందున గుత్ప, అలీసాగర్ లిఫ్ట్‌లను నడిపించి బాల్కొండ నియోజకవర్గంతో పాటు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాల్లోని చెరువులు నింపాలని, ఆయకట్టుకు సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే వందలాది రైతులతో కలిసి వచ్చి మేమే మోటార్లు ఆన్ చేస్తామని వేముల అల్టిమేటం జారీ చేశారు.

## కొత్త సిటీ లక్ష్యంగా

# సిఎం రేవంత్ ప్రచారం

### స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేసిన ప్రాంతంలోనే నిర్మాణం

### అమెరికా పర్యటనలో దీనిపైనా సిఎం ప్రస్తావన

**హైదరాబాద్, ఆగస్ట్7 (క్విక్ టుడే న్యూస్):** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో మరో కొత్త నగరాన్ని నిర్మిస్తానని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి దాన్నే చూపించి పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలను ఆహ్వాని స్తున్నారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు, వివిద పారిశ్రామికవేత్తల అవసరాలు, వారి సూచనలు, ప్రభుత్వ ఆలోచనలతో సరికొత్త పారిశ్రామిక విధానం తీసుకొస్తామని రేవంత్ రెడ్డి అంటున్నారు. ఫ్యూచర్ సిటీని హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు. అత్యాధునిక హంగులతో కాలుష్యానికి, ట్రాఫిక్ సమస్యల్లేకుండా ఈ సిటీ నిర్మించ బోతున్నట్టు వారికి వివరిస్తున్నారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ముచ్చెర్లలో ఏర్పాటు చేయబోయే ఫోర్త్ సిటీని ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడున్న మూడు సిటీల్లో భారీగా కాలుష్యం, ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నందున చాలా కంపెనీలు రావడానికి ఇబ్బంది ఎదురవుతోంది. అందుకే నాల్గో సిటీని తెరపైకి తీసుకొచ్చిన రేవంత్ రెడ్డి పారిశ్రామికవేత్తలకు పరిచయం చేస్తున్నారు. అక్కడ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌తోపాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్టు పేర్కొంటున్నారు. మెడికల్, టూరిజం, స్పోర్ట్స్,సాఫ్ట్‌వేర్, ఫార్మా విభాగాలు అక్కడ ఎస్టాబ్లిష్ చేస్తామని వారికి హామీ ఇస్తున్నారు. న్యూయార్క్ లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలతో రేవంత్ రెడ్డి సమావేశ మయ్యారు. ఫార్మా, బయోటెక్, ఐటీ, టెక్నాలజీ, షిప్పింగ్, ఈవీ రంగాలకు చెందిన కంపెనీ ప్రతినిధులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, వారికి కావాల్సిన ఎమినిటీస్ గురించి చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే వారికి ఎలాంటి సమస్య రాకుండా చూస్తామని, కంపెనీ విస్తరణ ప్రక్రియను కూడా సులభతరం చేస్తామని హామీ ఇచ్చారు. ఒక్క హైదరాబాద్ కాకుండా తెలంగాణలోని చాలా జిల్లాలు పారిశ్రామిక ఎదుగుదలకు అవకాశాలు ఉన్నాయని వాటిని క్లస్టర్లుగా విభజించి ప్రగతిపథంలోకి తీసుకొస్తా మన్నారు రేవంత్. అందుకే పారిశ్రామికవేత్తలంతా తెలంగాణ వస్తే కలిసికట్టుగా పని చేసి అన్నిరంగాల్లో తెలంగాణను నెంబర్ వన్‌లో నిలుపుదామని పిలుపునిచ్చారు.

---

# ఏపీలో మూడు నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేత

### క్యూఆర్ కోడ్‌తో కూడిన పాస్‌పుస్తకాలు పంపిణీ

### త్వరలోనే గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు

### మావోయిస్టులపై మరో ఏడాది నిషేధం విధింపు

### అక్టోబర్ నుంచి కొత్త మద్యం విధానం..

### మత్స్యకారుల 217 జీవో తొలగింపు

### సున్నిపెంటలో 280 ఎకరాలు తిరిగి జలవనరులశాఖకు బదలాయింపు

### వైద్య కళాశాల్లో అదనంగా 380 పోస్టులు భర్తీ

### ఏపీ కేబినేట్ కీలక నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

**అమరావతి, ఆగస్ట్7 :** రెవెన్యూశాఖలో మూడు నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తామని, క్యూఆర్ కోడ్‌తో కూడిన పాస్‌పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి పార్థసారథి వెల్లడించారు. రాష్ట్రంలో అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం విధానం అమలు చేస్తామన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన మద్యాన్ని అందిస్తామని తెలిపారు. జగన్ బొమ్మ, పేరు ఉన్న సర్వేరాళ్లను ఏం చేయాలనే అంశంపై చర్చించినట్లు తెలిపారు. దేశంలో ఫెర్టిలిటీ రేటు తగ్గుతోందని.. ఏపీలోనూ సంతానోత్పత్తి రేటు తగ్గుదల అంశంపై చర్చ జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం ముగిసింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. మంత్రివర్గం సమావేశం ముగిసిన అనంతరం మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను ఆయన వెల్లడించారు. స్థానిక ఎన్నికల్లో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే అనర్హత వేటు నిబంధన ఎత్తివేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నిబంధన ఎత్తివేసేలా చట్ట సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేరు తొలగించాలని పలువురు మంత్రులు సూచించారన్నారు. బొమ్మల పిచ్చితో నాటి సీఎం రూ.700 కోట్లు వాడేశారని మంత్రులు అన్నారని తెలిపారు. మావోయిస్టులపై మరో ఏడాది నిషేధం విధించేలా క్యాబినెట్ తీర్మానం చేసింది. వైకాపా ప్రభుత్వం, గతంలో తెదేపా హయాంలో చేపట్టిన మద్యం విధానాలపై చర్చ జరిగింది. ఎక్సైజ్ విధానంలో అక్రమాలకు తావులేకుండా మార్పులు, చేర్పులపైనా చర్చించారు. అక్టోబర్ నుంచి కొత్త మద్య విధానం అమల్లోకి రానుందని అన్నారు. మత్స్యకారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్న 217 జీవోను రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయించిం దని పార్థసారథి తెలిపారు. సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేరు తొలగించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజముద్ర ఉన్న కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి నిర్ణయం తీసుకుంది. జగన్ బొమ్మలతో ఉన్న పాస్ పుస్తకాలను వెనక్కి తీసుకోనుంది. రీ సర్వేపై క్యాబినెట్‌లో రెవెన్యూశాఖ నోట్ సమర్పించింది. దీనివల్ల తలెత్తిన వివాదాలపైనా చర్చ జరిగింది. గత ప్రభుత్వ విధానం వల్ల రీ-సర్వేపై ఆందోళన ఉందని మంత్రులు తెలిపారు. భూ యజమానుల్లో ఆందోళనతో గ్రామాల్లో వివాదాలు పెరుగుతాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. రీ- సర్వే పక్రియను పక్కన పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. గ్రామాలవారీగా రెవెన్యూ సదస్సులు నిరర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో 150 సీట్లతో నిర్మించిన కొత్త వైద్య కళాశాలల్లో గతంలో మంజూరైన పోస్టులకు అదనంగా మరో 380 పోస్టులు భర్తీ చేయాలన్న ప్రతిపాదనను ఆమోదించింది. ఫేజ్- 2కింద పాడేరు, మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లెలో నిర్మించిన వైద్య కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 100 సీట్లతో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ కోర్సు ప్రారంభించడానికి చేసిన ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గుజరాత్‌లో ఉన్న పీపీపీ మోడల్‌ను అధ్యయనం చేయాలని సీఎం సంబంధిత శాఖల మంత్రులు, అధికారుల్ని ఆదేశించారని వెల్లడించారు. జీవో నంబర్ 40 రద్దు కోసం జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం లభించింది. మే 11, 2023న జారీ చేసిన జీవో 40 ప్రకారం నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామ పంచాయతీకి కేటాయించిన 280.74 ఎకరాల భూమిని రద్దు చేస్తూ.. దాన్ని తిరిగి నీటిపారుదల శాఖకు బదలాయించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం. ఈ భూమిని అన్ని చట్టాలను పరిగణనలోకి తీసుకొని శ్రీశైలం దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు వినియోగించుకోవాలని సూచన చేశారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు తక్కువగా ఉండటంపై చర్చించాం. రాష్ట్ర భవిష్యత్తులో యువత జనాభా తగ్గిపోనుంది. ఎక్సైజ్‌శాఖలో మెరుగైన విధానాలు ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేయాలని నిర్ణయించాం‘ అని మంత్రి పార్థసారథి వివరించారు. ఈ క్రమంలో ముగ్గురు పిల్లలున్న వ్యక్తులు స్థానిక సంస్థలు, సహకార సంఘాల ఎన్నికల్లో పోటీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ముగ్గురు పిల్లలుంటే పోటీకి అనర్హత అనే నిబంధనను తొలగించేందుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు బిల్లుకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. వచ్చే అసెంబ్లీ సమావేశంలో ఇద్దరు పిల్లలే ఉండాలన్న నిబంధనను తొలగిస్తున్నట్టుగా ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టనుంది. నిబంధనను రద్దు చేస్తామంటూ ఎన్నికల సమయంలో కూటమి హామీ కూడా ఇచ్చింది. ఏపీలో జనాభా సంఖ్య రోజు రోజుకూ తగ్గుతోందన్నారు. జాతీయ సగటుతో పోల్చినా ఏపీలో జనాభా సంఖ్య తక్కువగానే ఉందన్నారు.యువత తగ్గిపోతోందన్న సర్వేలు వస్తున్నాయని అన్నారు. ఇద్దరి పిల్లలకంటే ఎక్కువ మంది ఉంటే పోటీ చేయకూడదని స్థానిక సంస్థల్లో నిబంధన ఉందని.. ఇలాంటి నిబంధనలను రద్దు చేస్తూ బిల్లుకు ఆమోదం తెలిపామన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జనాభా పెరుగదల అవసరమని చెప్పుకొచ్చారు. పిల్లల సంఖ్యపై నిషేధాలు ఉండకూడదని కేబినెట్ భావిస్తోందని మంత్రి వెల్లడించారు. మరోవైపు.. గత ప్రభుత్వంలో ఎక్సైజ్‌లో జరిగిన అవతవకలపై కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. 2014-19, 2019-24 ప్రభుత్వాల్లో ఎక్సైజ్ పాలసీలపై చర్చించారు. గత ప్రభుత్వం దోపిడీకే ఎక్సైజ్ పాలసీ రూపొందించిందని కేబినెట్ అభిప్రాయపడింది. దీంతో ప్రస్తుత ఎక్సైజ్ పాలసీని తొలగించి.. కొత్త ఎక్సైజ్ పాలసీ రూపొందించేందుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు ఎక్సైజ్ ప్రొక్యూర్మెంట్ పాలసీలో కూడా మార్పులు తీసుకురావాలని కేబినెట్ సూచన చేసింది. ఇక మత్స్యకారులకు నష్టం చేకూర్చేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన 217 జీవో రద్దు కేబినెట్ రద్దు చేసింది. మావోయిస్టులపై నిషేధం పొడిగిస్తూ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రామాల్లో చెరువులను.. కుంటలను బహిరంగ వేలం వేయాలని గత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మత్స్యకారుల సంక్షేమం, జీవన ప్రమాణాలు పెంచడం, మత్స్య సంపద పెంచే అంశంపై అధ్యయనం చేయాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఎక్సైజ్ శాఖను ఏకీకృత పర్యవేక్షణకు నిర్ణయం తీసుకున్నామన్నారు. మెరుగైన ఎక్సైజ్ పాలసీన రూపొందిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం సరఫరా చేసిన మద్యం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్న దన్నారు. ఇకపై ప్రముఖ బ్రాండ్లను ఏపీ మార్కెట్టులోకి తెస్తామన్నారు. అక్టోబర్ నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ అమలు చేయనున్నట్లు తెలపారు. మద్యం ధరలు తగ్గిస్తామన్నారు. గత ప్రభుత్వ మద్యం విధానాల వల్ల రూ. 18 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. మద్యం ఉత్పత్తి నుంచి అమ్మకాల వరకు గత ప్రభుత్వం గుత్తాధిపత్యం ఉండేలా విధానాన్ని రూపొందించిందని మంత్రి వర్గం అభిప్రాయపడిందన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి త్వరలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వివాదంలో ఉన్న రిజిస్ట్రేషన్ల పునః పరిశీలన చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు 25 వేల ఎకరాలు రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. మూడు నెలల పాటు అసైన్డ్, 22-ఏ రిజిస్ట్రేషన్లు విచారణ చేపడతామని తెలిపారు. మూడు నెలల పాటు విచారణ పూర్తయ్యేంత వరకు 22-ఏ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపేస్తామని స్పష్టం చేశారు.

### పామ్ బోర్డ్ ఏర్పాటు చేయాలని
# కేంద్రానికి వినతి

**ఢిల్లీలో ఫెడరేషన్ అఫ్ కల్చురీ అసోసియేషన్ సమావేశంలో తీర్మానం**

**తెలంగాణ నుంచి ప్రతినిధిగా హాజరైన పల్లె లక్ష్మణ్ రావు గౌడ్**




**హైదరాబాద్, ఆగస్టు 7 (క్విక్ టుడే న్యూస్) :** చేతి వృత్తులకు సంబంధించి పామ్ బోర్డు ఏర్పాటు చేయాలనీ కేంద్రానికి ఫెడరేషన్ అఫ్ కల్చురీ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తీర్మానం చేశారు. ఢిల్లీలో బుధవారం కల్చురీ అసోసియేషన్ జాతీయ సమావేశం కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి తెలంగాణ గౌడ్ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ రావు గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ త్వరలో అఖిల భారత సమావేశాన్ని ఏర్పాటు చేయాలనీ నిర్ణయించారు. గీత వృత్తి అనుబంధ కులాలను ఏకతాటిపైకి తీసుకు రావాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో 10 శాతం ప్రజలు తాము ఉన్నట్లు తెలిపారు. చట్టసభల్లో తమ బలాన్ని పెంచాలని, ఆ దిశగా అడుగులేద్దాం అన్నారు. ఐక్యమత్యమే తమ బలమన్నారు. ఈ కార్యక్రమంలో గోపగాని వెంకటనారాయణ గౌడ్, అనురాధ గౌడ్, వాస కుమార్ జైస్వాల్, నారాయణ చోక్సే , బొడ్డు ఆనంద్ కుమార్ గౌడ్ , కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### జగన్‌కు భద్రత కుదింపుపై
# హైకోర్టులో విచారణ

**అమరావతి, ఆగస్ట్7 (క్విక్ టుడే న్యూస్) :** తనకు భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ మాజీ సీఎం జగన్ వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా జగన్‌కు ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనం రీప్లేస్ చేస్తామని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ప్రస్తుతం కండిషన్‌లో ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఆయనకు ఇస్తామంది. జగన్ భద్రతా సిబ్బంది సమాచారం ఇస్తే జామర్ ఇస్తామని స్పష్టం చేసింది. దీనిపై కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. తనకు జడ్ ప్లస్ కేటగిరీని కుదించడాన్ని సవాలు చేస్తూ వైఎస్ జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జూన్ 3వ తేదీకి తనకు ఉన్న భద్రతను పునరుద్ధరించాలని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ఏపీ ప్రభుత్వానికి కీలక సూచనలు చేసింది. వైఎస్ జగన్‌కు మంచి బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఎందుకు ఇవ్వడం లేదని ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. జగన్‌కు మరో బుల్లెట్ ప్రూఫ్ వాహనం కేటాయించాలని సూచించింది. జామర్ ఏర్పాటుపై కూడా స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. జగన్‌కు జామర్ వెహికల్స్‌ను కూడా కేటాయిస్తామని వివరించింది. మాజీ ముఖ్యమంత్రికి ప్రభుత్వం భద్రత కల్పించాల్సిందేనని స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం తనకు భద్రతను తగ్గించేశారని, ప్రాణహాని ఉన్నందున ఎన్నికల ఫలితాలకు ముందున్న భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తనకు అందించిన భద్రత ప్రాముఖ్యతను జగన్ గుర్తుచేశారు. తన పదవికున్న సున్నితమైన స్వభావం, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా తనకు భద్రత అత్యంత కీలకమని పేరొన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక ఆశ్చర్యకరంగా నెల రోజుల్లోనే తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే భద్రతను తగ్గించారని పిటిషన్‌లో పేరొన్నారు. జడ్ ప్లస్‌గా ఉన్న తన భద్రతను తగ్గించడంతో పాటు భద్రతా సిబ్బంది సంఖ్యను కూడా భారీగా తగ్గించేశారని ఆరోపించారు. ప్రస్తుతం తనకు అన్ని వేళలా కేవలం ఇద్దరు భద్రతాధికారులు మాత్రమే ఉన్నట్టు పేర్కొన్నారు. గతంలో తనకు 139 మంది భద్రతా సిబ్బంది ఉండగా.. దాన్ని 59కి కుదించారని, దీన్ని పునరుద్ధరించాలని జగన్ తన పిటిషన్‌లో కోరారు.

### మదనపల్లె ఘటనలో
# దోషిగా నిలబెట్టే ప్రయత్నం

**ఎలాంటి విచారణ చేసుకున్నా అభ్యంతరం లేదు**

**మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**

**చిత్తూరు, ఆగస్ట్7 (క్విక్ టుడే న్యూస్) :** చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి తనకు వ్యతిరేకంగానే పనిచేశారని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. తనపై కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. మదనపల్లిలో రికార్డులు తగలబడితే తనపై నిందలు వేస్తున్నారని అన్నారు. తనను దోషజగా నిలబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. ఈ కేసుకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఏ దర్యాప్తు సంస్థతోనైనా ఈ కేసును ప్రభుత్వం దర్యాప్తు చేయించుకోవచ్చని తెలిపారు. ఆధారాలు లేకుండా అధికారులు అత్యుత్సాహం చూపిస్తున్నారని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. ఆధారాలు ఉంటే నిరూపించాలని సవాలు విసిరారు. తన కుటుంబంపై అనవసరంగా రోపణలు చేస్తున్నారని అన్నారు. తమ ఆస్తులను ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచామని చెప్పారు. అయినప్పటికీ కేసులు వేసి వేధించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులు చేస్తున్న కుట్రలు రాష్ట్ర ప్రజలకు తెలుసు అని పెద్దిరెడ్డి అన్నారు. రికార్డులు కాలిపోయాయని ఏకంగా డీజీపీనే హెలికాప్టర్ వేసుకుని వచ్చారని.. ఇలాంటి పరిస్థితి ఎప్పుడు లేదని తెలిపారు. ఈ ఘటనకు రాజకీయ రంగు పులిమి.. అత్యుత్సాహంతో కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

### వివేకా హంతకులకు అండగా ఉన్నవారిపై
# చర్యలు తీసుకోండి : వైఎస్ సునీత



**అమరావతి, ఆగస్ట్7 (క్విక్ టుడే న్యూస్) :** మాజీ పార్లమెంట్ సభ్యుడు వైఎస్ వివేకానందా రెడ్డిని చంపిన హంతకులకు అండగా నిలిచిన వారిపై చర్యలు తీసుకోవాలని వివేకా తనయ వైఎస్ సునీత కోరారు. బుధవారం హోం మంత్రి అనితను ఆమె కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తన తండ్రి హత్య కేసులో జరిగిన అన్యాయాన్ని, వివేకా హత్య తదనంతర పరిణామాలను వివరించారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక పోలీసులు హంతకులకు అండగా నిలిచారని ఆరోపించారు . హంతకులకు అండగా నిలిచిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ సమయంలో కేసును నీరుగార్చేలా వ్యవహరించారని ఫిర్యాదు చేశారు. సీబీఐ అధికారులపై తప్పుడు కేసుతో పాటు సాక్షులను బెదిరించారని వాపోయారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ సీబీఐ విచారణ ఉన్నందున ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం ఉంటుందని మంత్రి వివరించారు. దోషులకు శిక్షపడేలా చూసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని వెల్లడించారు. తప్పు చేసిన పోలీసులను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

# చేనేతకు అన్ని విధాలుగా అండగా ఉంటా

**జిఎస్టీ రద్దు కోసం కేంద్రంతో పోరాడుతా**

**బిసిలకు 33శాతం రిజర్వేషన్లకు అసెంబ్లీలో తీర్మానిస్తా**

**చేనేత సభలో చంద్రబాబు ప్రకటన**

**స్టాళ్లను సందర్శించి..భువనేశ్వరి కోసం రెండు చీరల కొనుగోలు**




**విజయవాడ, ఆగస్ట్7 (క్విక్ టుడే న్యూస్) :** చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. చేనేతకారులకు ఇచ్చిన అన్ని పథకాలనూ వైకాపా సర్కారు రద్దు చేసిందని మండిపడ్డారు. కార్మికుల ఆదాయం పెరిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడలో జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. స్టాళ్లలో ఉత్పత్తులు పరిశీలించి చేనేత కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తన సతీమణి భువనేశ్వరికి రెండు చీరలు కొనుగోలు చేశారు. చట్టసభల్లో వెనుకబడిన వర్గాలకు 33శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేస్తామని ప్రకటించారు. ఇది పార్లమెంటులో చట్టరూపం దాల్చేలా పోరాటం చేస్తామన్నారు. వెనకబడిన వర్గాల్లో అనేక కులాలు ఉన్నాయని, వారి అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు న్యాయం చేస్తాం. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, స్పీకర్ పదవులను బీసీలకే ఇచ్చాం. మంత్రివర్గంలోనూ అగ్రస్థానం కల్పించిన పార్టీ మాది. బీసీలు.. ఆది నుంచీ పార్టీకి అండగా ఉన్నారు. స్థానిక సంస్థల్లో మళ్లీ రిజర్వేషన్లు తెస్తాం. చేనేత రంగంలో సమగ్ర విధానం తీసుకొస్తాం. చేనేతకారుల్లో నైపుణ్యం పెంచి ఆధునిక శిక్షణ ఇప్పిస్తాం. వారికి ఆరోగ్యబీమా కల్పిస్తాం. చేనేత కార్మికులకు జీఎస్టీ తొలగించేందుకు ప్రయత్నిస్తాం. జీఎస్టీ తొలగించకుంటే రియంబర్స్ చేస్తాం అని ప్రకటించారు. నేతన్నలకు రూ.67 కోట్లు ఇచ్చి న్యాయం చేస్తాం. నేతన్నలు సామూహికంగా పనిచేసే విధానానికి శ్రీకారం చుడతాం. చేనేత మగ్గాల కోసం రూ.50వేలు సాయం చేస్తాం. ప్రజలంతా చేనేత వస్త్రాలు ధరించాలి. చేనేత పరిశ్రమను కాపాడటం మన బాధ్యత. నెలకు ఒకరోజైనా చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిస్తున్నానని అన్నారు. చేనేత వస్త్రాలకు ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను ప్రోత్సహిస్తాం. చేనేత మరమగ్గాల కార్మికులకు, సౌర విద్యుత్ ప్యానెళ్ల ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తాం. చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తాం. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చేనేతలో సహజ రంగులను ప్రోత్సహిస్తాం అని చంద్రబాబు తెలిపారు. ఏపీలో ఏ శాఖలో చూసినా దోపిడీ, విధ్వంసం, అవినీతి, వ్యవస్థల నిర్వీర్యమే కనబడుతోంది. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. ఏనాడూ ఇన్ని ఇబ్బందులు చూడలేదు. వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టి.. నిర్వీర్యమైంది. ఇబ్బందులు ఉన్నాయని ఇచ్చిన హామీలను వదిలిపెట్టలేదు. తొలి రోజే ఐదు సంతకాలు పెట్టాను. క్యాబినెట్‌లో పెట్టి నిర్ణయాలు చేసి అమలు చేస్తున్నాం. వైకాపా నేతలు ఐదేళ్లలో ప్రజల భూములు, ఆస్తులు కొట్టేశారు. రికార్డులు తారుమారు చేసి పేదలను అనేక ఇబ్బందులు పెట్టారని చంద్రబాబు మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు తీసుకొస్తామని చెప్పారు. అట్టడుగు వర్గాలను ఆర్థికంగా, రాజకీయంగా , సామాజికంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. చట్టసభల్లో వెనుకబడిన తరగతుల వారికి 33శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో చట్టం కోసం ప్రయత్నిస్తామని అన్నారు. రాబోయే నామినేటెడ్ పోస్టుల్లోనూ బీసీలకు న్యాయం చేస్తామన్నారు.మెగా డీఎస్సీలో 16347 ఉద్యోగాలు ఇవ్వబోతున్నామని తెలిపారు. ల్యాండ్ అండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామని తెలిపారు.

# ప్రకాశం బ్యారేజీకి భారీగా వరదనీరు

**70 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన అధికారులు**

**కృష్ణమ్మ పరవళ్లు చూసి ఉప్పొంగిపోయిన సిఎం**

**ప్రజలతో కలసి బ్యారేజీ వద్ద సెల్ఫీలు దిగిన బాబు**



**విజయవాడ, ఆగస్ట్7 (క్విక్ టుడే న్యూస్) :** ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లు చూసిన సిఎం చంద్రబాబు పలుకించిపోయారు. ఎన్నాళ్లకెన్నాళ్లకు మళ్లీ జలకళ వచ్చిందంటూ పొంగిపోయారు. కాసేపు అక్కడే ఆగి ఆ దృశ్యాలను చూస్తూ ఉండిపోయారు. విజయవాడలో చేనేత దినోత్సవ వేడుకలు ముగించుకుని ఉండవల్లి వెళ్తూ ప్రకాశం బ్యారేజీపై కాన్వాయ్ ఆపి సీఎం చంద్రబాబు నాయుడు కిందకు దిగారు. బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లును ఆసక్తిగా తిలకించారు. వరద ప్రవాహాన్ని చూసేందుకు బ్యారేజీ వద్దకు వచ్చిన సందర్శకులను దగ్గరకు పిలిచి మరీ చంద్రబాబు మాట్లాడారు. సందర్శకులతో చంద్రబాబు సెల్ఫీలు దిగారు. కృష్ణమ్మ జలకళ ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. నీటి ప్రవాహాన్ని చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉందంటూ ఆయన సంతోషం వ్యక్తం చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి తమ దగ్గరకు వచ్చి మాట్లాడడంతో సందర్శకులు ఆశ్చర్యానికి గురయ్యారు. చాలా సంతోషంగా ఉందని అన్నారు. కృష్ణమ్మకు జలకళ రావడం చూసి ఎంతో సంతోషిస్తున్నట్లు తెలిపారు. ఈ నీటి ప్రవాహాన్ని చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉందంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తుతోంది. దీంతో బ్యారేజీలోని మొత్తం 70 గేట్లను ఎత్తి 73,227 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు కాల్వల ద్వారా 13,477 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. సాయంత్రం లేదా రాత్రికి లక్షన్నర క్యూసెక్కులకు చేరుకునే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. గేట్లు ఎత్తిన నేపథ్యంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తున్నారు. దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. కాల్వల ద్వారా విడుదల చేసే వరదనీరు పూడిక ప్రభావంతో రోడ్లపైకి చేరుకోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటా

**యువత కూడా చేనేత వస్త్రాలు ధరిస్తే మంచిది**

**చేనేతకు జీవం పోయాల్సిన బాధ్యత అందరిదీ**

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**



**విజయవాడ, ఆగస్ట్7 (క్విక్ టుడే న్యూస్) :** అతిపెద్ద అసంఘటిత రంగాల్లో ఒకటైన చేనేత పరిశ్రమను ఆదుకోవడానికి ఏపీ కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చేనేత రంగానికి జీవం పాయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. చేనేత వస్త్రాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటానని గతంలోనే చెప్పానని, చెప్పినట్లే చేనేత వస్త్రాలు ధరిస్తున్నానని వెల్లడించారు. యువత, ఉద్యోగులు కూడా చేనేత వస్త్రాలు ధరించాలని సూచించారు. నేతన్నలు, చేనేత పరిశ్రమకు మా ప్రభుత్వం భరోసా ఇస్తుందని వివరించారు. చేనేత శాఖల్లో సంస్కరణలు తీసుకొచ్చి ఆదుకుంటామని పేర్కొన్నారు. ఏపీలో చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేవరకు అండగా ఉంటామని అన్నారు. వారంలో ఒక్కరోజైనా ప్రజలు చేనేత వస్త్రాలు ధరించాలని పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. ఏపీలో ఉప్పాడ, మంగళగిరి, చీరాల, పెడన, పొందూరు, ఎమ్మిగనూరు, వెంకటగిరి... చేనేత వస్త్రాలకు ప్రతీకలుగా ఉన్నాయని తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన చేనేత కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత వస్త్రాలు అనే మాట ప్రజల్లో ఒక భావోద్వేగాన్ని నింపింది. అలాంటి చేనేత రంగానికి జీవంపోయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. రాష్ట్రంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం కచ్చితంగా చేనేత పరిశ్రమకు, ఈ రంగంపై ఆధారపడ్డ నేతన్నలకు భరోసా ఇస్తుంది. అదే విధంగా ప్రజలు సైతం ఈ రంగానికి ప్రోత్సాహమివ్వాల్సిన అవసరం ఉంది. కొన్నేళ్ల కిందట నేను చేనేత వస్త్రాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను అని చెప్పాను. ఆ క్రమంలోనే నేత వస్త్రాలను ధరిస్తున్నాను. అదే విధంగా యువత, ఉద్యోగులు వారంలో ఒక రోజైనా చేనేత వస్త్రాలను ధరిస్తే ఈ రంగంపై ఆధారపడ్డవారికి ధీమా కలుగుతుందని అన్నారు.

### రాజ్యాంగేతర శక్తులుగా
# రేవంత్ సోదరులు

**అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం దారుణం**


**మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**

**హైదరాబాద్, ఆగస్ట్7 (క్విక్ టుడే న్యూస్) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ తన సోదరులను తెలంగాణ మీదకు వదిలేశారని.. అతని సోదరులకు ఏ పదవులు లేకున్నా రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సాక్షాత్తూ అసెంబ్లీ కమిటీ హాల్‌లో రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఏ హోదా లేకున్నా స్పీకర్ దగ్గర వికారాబాద్ రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. కొడంగల్‌లో తిరుపతి రెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కులను పంచుతుంటే తమ జెడ్పిటీస్ మహిపాల్ అడ్డుకున్నారని తెలిపారు. రేవంత్ మరో సోదరుడు కొండల్ రెడ్డికి ఏ హోదా ఉందని అధికారులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారని ప్రశ్నించారు. రేవంత్ అమెరికా పర్యటనలో స్వచ్ బయోతో రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకుందని.. ఆ కంపెనీ రేవంత్ మరో సోదరుడు ఎనుముల జగదీశ్ రెడ్డిది అని తెలిపారు. పదిహేను రోజుల క్రితమే ఆ కంపెనీ ఏర్పాటయ్యిందని అన్నారు. అవే కాకుండా రేవంత్ సోదరుల ఆధ్వర్యంలో నాలుగు సంస్థలు ఏర్పాటు అయ్యాయన్నారు. ఈ సంస్థల ద్వారానే రేవంత్ బ్లాక్ మనీని వైట్‌గా మారుస్తున్నారని విమర్శలు గుప్పించారు. ప్రధాన కంపెనిలే కాకుండా రేవంత్ సోదరులు అనేక మైక్రో సంస్థల్లో డైరెక్టర్లుగా ఉన్నారన్నారు. రేవంత్ సోదరులు రియల్టర్లను బెదిరించి విచ్చల విడిగా అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలు చేశారు.

# వైసీపీ పార్టీకి భారీ షాక్

**పిఠాపురం మాజీ ఎమ్మెల్యే**

**పెండెం దొరబాబు రాజీనామా**



**కాకినాడ, ఆగస్ట్7 (క్విక్ టుడే న్యూస్) :** పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు వైసీపీ పార్టీకి భారీ షాక్ ఇచ్చారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వైసీపీలో తగిన ప్రాధాన్యత సరైన గుర్తింపు లేకపోవడం వల్లే పార్టీని వీడుతున్నట్లు దొరబాబు తెలిపారు. రాజకీయ స్వలాభం కోసం కాదని, పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఎలాంటి పదవులు ఆశించడం లేదని, ప్రజలకు మంచి జరగాలన్నదే తన కోరిక అని స్పష్టం చేశారు. గత కొద్ది రోజులుగా ఆయన పార్టీ వీడుతున్నట్లు వార్తలు వచ్చాయి. కొంత మంది వాటిని కొట్టిపారేయగా మరికొంతమంది నిజమే అంటూ నియోజకవర్గంలో చర్చించుకున్నారు. అయితే తాజాగా పెండెం దొరబాబు ప్రకటనతో ఉత్కంఠకు తెరదించినట్లయ్యింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలోని ఏదో ఒక పార్టీలో తాను చేరుతానని మాజీ ఎమ్మెల్యే దొరబాబు స్పష్టం చేశారు. అన్నీ పార్టీల నుంచి ఆహ్వానాలు ఉన్నాయని, అనుచరులతో చర్చించిన తర్వాతే భవిష్యత్తు నిర్ణయం ప్రకటిస్తానని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గ ప్రజలతో 25ఏళ్లుగా మమేకమై ఉన్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. తన వెంట ఇప్పటివరకూ నడిచిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. తనకు వెన్నుపోటు రాజకీయాలు తెలియవని చెప్పారు. పిఠాపురంలోనే ఉండి ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు.

## రాజ్‌తో రిలేషన్‌షిప్...
# త్వరలోనే పెళ్లి

'ధూత'వెబ్ సిరీస్‌తో తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటి ప్రియా భవానీ శంకర్ తాజాగా తన పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజ్ అనే వ్యక్తితో తాను దాదాపు పదేళ్ల నుంచి రిలేషన్‌లో ఉన్నానని తెలిపారు. వివాహ బంధంలోకి అడుగుపెట్టాలని ఎప్పటినుంచో అనుకుంటున్నామని.. వచ్చే ఏడాది తప్పకుండా పెళ్లి చేసుకుంటామన్నారు. సినీ పరిశ్రమలోకి రాక ముందునుంచే రాజ్‌తో నేను ప్రేమలో ఉన్నా. మేమిద్దరం విడిపోయామంటూ ఇప్పటికే ఎన్నోసార్లు వార్తలు వచ్చాయి. వాటిని పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పటివరకూ నేను చాలామంది నటులతో కలిసి వర్క్ చేశా. వారితో ఉన్న స్నేహం కారణంగా.. పుట్టినరోజు, లేదా ఏదైనా స్పెషల్ డే వచ్చినప్పుడు వారికి విషెస్ చెబుతూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టేదాన్ని. అలా, పెట్టడమే ఆలస్యం.. వారితో నేను రిలేషన్‌లో ఉన్నానంటూ వార్తలు వచ్చేవి. అదృష్టంకొద్దీ ఇప్పుడు ఆ తారలకు పెళ్లి కూడా అయింది అని ఆమె నవ్వుతూ చెప్పారు. చెన్నైకు చెందిన ప్రియా భవానీశంకర్.. 'మేయాద మాన్'తో నటిగా తెరంగేట్రం చేశారు. 2023లో విడుదలైన 'కళ్యాణం కమనీయం'తో ఆమె తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. సంతోష్ శోభన్ హీరోగా నటించిన ఆ సినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. అనంతరం ఆమె 'ధూత'లో నాగచైతన్య సతీమణిగా కనిపించి ప్రేక్షకులను అలరించారు.






# ఆనందోబ్రహ్మకు సీక్వెల్


ల్గ తెలుగు సినీ పరిశ్రమలో ఇప్పుడు సీక్వెల్స్‌కు, ఫ్రాంచైజీలకు మంచి సీజన్ నడుస్తోంది. ప్రస్తుతం తెలుగులో పలు సీక్వెల్స్ సెట్స్ మీద వున్నాయి. ఇందులో ఈ భాగంగానే తాప్సీ కథానాయికగా నటించిన విజయవంతమైన హారర్ కామెడీ థ్రిల్లర్ ఆనందో బ్రహ్మకు సీక్వెల్ రాబోతుంది. ఇంతకు ముందు ఆనందో బ్రహ్మ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శక నిర్మాత మహి.వి.రాఘవ ఈ సీక్వెల్‌ను రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నాడు.ప్రస్తుతం ఆనందో బ్రహ్మకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ మొదలయ్యాయి. అయితే ఈ చిత్రం మొదటిభాగంలో నటించిన కథానాయిక తాప్సీని ఒప్పించే పనిలో వున్నాడు మహి. ఈ సీక్వెల్ కోసం ఆమెను సంప్రదించి ఒప్పించినట్లు తెలిసింది. అంతేకాదు ఈ సినిమలో ఓ యంగ్‌హీరో కూడా ముఖ్యపాత్రలో కనిపించబోతున్నాడు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని చేయాలనే ఆలోచనలో వున్నారు దర్శక నిర్మాతలు. ఆనందో బ్రహ్మను తమిళంలో పెట్రోమాక్స్‌గా రిమేక్ చేయగా.. ఇందులో తమన్నా కథానాయికగా నటించింది.



## వయనాడ్ బాధితులకు
# ప్రభాస్ అండ

### 2కోట్ల విరాళం ప్రకటించినట్లు టీమ్ ప్రకటన

కష్టాల్లో ఉన్నవారికి చేయూత అందించడానికి నటుడు ప్రభాస్ ఎప్పుడూ ముందుంటారు. తాజాగా ఆయన మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. కేరళలోని వయనాడ్ జిల్లాలో చోటుచేసుకున్న విషాదాన్ని దృష్టిలో ఉంచుకుని భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈమేరకు కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు ప్రభాస్ రూ.2 కోట్లు విరాళం ఇస్తున్నట్లు ఆయన టీమ్ తెలిపింది. దీనిపై సినీ ప్రియులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. టాలీవుడ్ నుంచి అంత మొత్తంలో విరాళాన్ని చెల్లించిన హీరో ఆయనే కావడం విశేషమని నెటిజన్లు అనుకుంటున్నారు. ఆయన గొప్ప మనసుని మెచ్చుకుంటున్నారు. వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన అందరినీ కలచివేస్తోంది. సహాయక చర్యల కోసం పలువురు సినీతారలు ముందుకొచ్చి ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఆ విషాద ఘటనపై స్పందించిన చిరంజీవి, రామ్‌చరణ్ రూ.కోటి విరాళంగా ప్రకటించారు. అల్లు అర్జున్ రూ.25 లక్షలు కేరళ సీఎం సహాయ నిధికి అందిస్తున్నట్లు తెలిపారు.



## రామ్‌చరణ్
## అభిమానులకు శుభవార్త

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్' మూవీ మీద ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తోన్న ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వాని హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే వదిలిన పోస్టర్స్, 'జరగండి జరగండి..' సాంగ్ మినహా సరైన అప్డేట్ మాత్రం ఇప్పటి వరకు మేకర్స్ నుంచి రాలేదనే చెప్పుకోవాలి. ఈ విషయంలో నిరాశలో ఉన్న ఫ్యాన్స్‌కు.. ఇకపై అప్డేట్స్ బీభత్సంగా ఉంటాయనేలా హింట్ వచ్చేసింది. అవును.. ఈ సినిమాకు సంబంధించి తాజాగా మేకర్స్ ఓ అధికారిక అప్డేట్‌ను ఇచ్చారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముగించుకుని డబ్బింగ్ కార్యక్రమాలను జరుపుకుంటున్నట్లుగా.. అందుకు సంబంధించిన ఫొటోలతో మేకర్స్ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ అధికారిక ప్రకటనను విడుదల చేసింది. దీంతో ఇప్పటి వరకు ఫ్యాన్స్‌కు ఉన్న అనుమానాలు తొలగినట్లయింది. ఇంత వరకు సినిమా షూటింగ్ ఏ స్టేజ్‌లో ఉందో తెలియందు. డిసెంబర్ రిలీజ్ అంటున్నారా? డిసెంబర్‌కి నిజంగా 'గేమ్ చేంజర్' విడుదల ఉంటుందా? అనే మెగాభిమానులకు ఈ అప్డేట్ కాస్త క్లారిటీని ఇచ్చినట్లయింది. దీంతో.. 'గేమ్ చేంజర్' ట్యాగ్‌ని వారు వైరల్ చేస్తూ.. ట్రెండింగ్‌లోకి తీసుకొచ్చారు.విలక్షణ నటుడు ఎస్.జె. సూర్య కూడా ట్విట్టర్ వేదికగా ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు యమా జోరుగా జరుగుతున్నట్లుగా వెల్లడించారు. రీసెంట్‌గా హీరోయిన్ కియారా అద్వానీ పుట్టినరోజును పురస్కరించుకుని 'గేమ్ ఛేంజర్' నుంచి ఆమె లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. చూపు తిప్పుకోవటం కష్టం అనేంత బ్యూటీగా కియారా ఈ లుక్‌లో కట్టి పడేసింది. ఇక లార్జర్ దేన్ లైఫ్ చిత్రాలను అబ్బురపరిచే రీతిలో తెరకెక్కించే శంకర్ ఇప్పటి వరకు తెరకెక్కించిన సినిమాలను మించేలా 'గేమ్ ఛేంజర్'ను రూపొందిస్తున్నట్లుగా మేకర్స్ చెబుతున్నారు.



## అఖిల్ అక్కినేనికి
# కలసిరాని కాలం

హీరోగా అఖిల్ అక్కినేనికి కలిసి రావడం లేదు. చిన్నప్పుడు చేసిన 'సిసింద్రీ', గెస్ట్ అప్పీరియెన్స్ ఇచ్చి 'మనం' మినహా.. అఖిల్‌కు చెప్పుకోవడానికి సరైన హిట్ ఇంత వరకు పడలేదనే చెప్పుకోవాలి. ఎలాగైనా అఖిల్‌కి ఓ బ్లాక్‌బస్టర్ ఇవ్వాలని తండ్రి నాగార్జున చేయని ప్రయత్నాలు లేవు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కి, ఎన్నో అంచనాల నడుమ విడుదలైన 'ఏజెంట్' మూవీ కూడా అఖిల్‌కు సక్సెస్‌ని ఇవ్వలేకపోయింది. ఆ సినిమా వచ్చి సంవత్సరం పూర్తయినా.. ఇంత వరకు అఖిల్ తర్వాత సినిమాకు సంబంధించి ఎటువంటి ప్రకటనా రాలేదంటే.. అఖిల్ విషయంలో అక్కినేని ఫ్యామిలీ ఎంత డైలామాలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అసలు అఖిల్ కు ఎలాంటి సినిమా పడాలి? అఖిల్‌ని ఎలా ప్రేక్షకులలో నిలబెట్టాలి? అనే ఆలోచనలో ఉన్న అక్కినేని ఫ్యామిలీ.. చివరకు ఓ నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది.



## తమిళ బ్లాక్ బ్లస్టర్
# సూపర్ డీలక్స్ 9న విడుదల

కోలీవుడ్‌లో ఎప్పుడో విడుదలై ఘన విజయం సాధించిన మాస్టర్ పీస్ చిత్రం.. ఇన్నాళ్ల తర్వాత తెలుగులో గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమైంది. మక్కల్ సెల్వన్ విజయ సేతుపతి, 'పుష్ప' ఫేమ్ ఫహద్ ఫాసిల్ , సమంత ముఖ్య పాత్రల్లో రమ్యకృష్ణ, మిస్కిన్, గాయత్రి, భగవతి పెరుమాళ్ ఇతర ముఖ్య పాత్రల్లో నటించిన మాస్టర్ పీస్ చిత్రం 'సూపర్ డీలక్స్'. ఈ సినిమా తమిళ్‌లో బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడీ మూవీ ఆగస్ట్ 9న తెలుగులో గ్రాండ్ రిలీజ్ సిద్ధమైంది. విజయ్ సేతుపతిలోని విలక్షణతను చాటిన ఈ సినిమా తమిళ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. విజయ్ సేతుపతి ఈ సినిమాలో స్పెషల్ లేడీ క్యారెక్టర్ రోల్‌లో నటించారు. ఆయన చేసిన పాత్రకుగానూ ఎన్నో అవార్డ్స్ అందుకున్నారు. ఫహద్ ఫాసిల్, సమంత, రమ్యకృష్ణ పాత్రలు ఈ సినిమాకు మరో ప్రత్యేక ఆకర్షణ. యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందించారు. నాలుగు విభిన్న కథలను జోడించి చిత్రీకరించిన ఈ చిత్రం ఎన్నో అవార్డులను, క్రిటిక్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ అందుకుంది. తమిళంలో బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన సూపర్ డీలక్స్ సినిమా ఇప్పుడు తెలుగులోనూ ఘన విజయం సాధిస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. ఆగస్ట్ 9న టాలీవుడ్‌లో పలు సినిమాలు రిలీజ్‌కు ఉన్నప్పటికీ.. 400కి పైగా థియేటర్లలో ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

**Owner, Editor, Printed & Published:** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500098. Telangana. Printed at S.A Printers, D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District, Telangana, -500098. **RNI NO TELTEL/2023/86487**, Cell: 8125972476. website: quicktodaynews.com, e-mail: quicktodaynews@gmail.com